నమస్తే తెలంగాణ

మెదక్

I హైదరాబాద్, మంగళవారం 18 మార్చి 2025 MEDAK


# ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆత్మహత్యలు

- హబ్సీపూర్ గురుకుల విద్యార్థి ఆత్మహత్య ఘటనపై..
- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీసిన దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి



అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, మార్చి17: కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే గురుకులాలు, వసతి గృహాల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సోమవారం అసెంబ్లీలో విమర్శించారు. దుబ్బాక నియోజకవర్గంలోని హబ్షీపూర్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకులంలో 7వ తరగతి విద్యార్థి అఖిల్ ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటనపై ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యార్థికి ఆత్మహత్య చేసుకునే ఆలోచన రావడం తనను విస్మయానికి గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గురుకులంలో విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా సమయానికి తోటి విద్యార్థులు రక్షించారని, లేనిచో ఆ విద్యార్థి నిండు జీవితం బలైపోయేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత పెద్ద సంఘటన బయటకు పొక్కకుండా జిల్లా అధికారులు, గురుకుల పాఠశాల సిబ్బందిపై ఒత్తిడి తీసుకురావడం ఏమిటని ప్రశ్నించారు. ప్రస్తుతం ఆ విద్యార్థి నిలోఫర్‌లో చికిత్స పొందుతున్నాడని, రెండు రోజులు ఇబ్బందులు ఎదుర్కొని స్పృహలోకి వచ్చినట్లు తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో, ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగుతున్న తరుణంలో వసతి గృహాలను పరిశీలిస్తే చాలా ఇబ్బందికరమైన మార్పులు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ సర్కారులో గురుకులాలు పేద విద్యార్థులకు దేవాలయాలుగా ఉంటే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కారాగారాలను తలపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులాల్లో విద్యార్థులకు మంచి విద్య అందించడంతో పాటు వసతులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు.

# రేపటి నుంచి నాచగిరి బ్రహ్మోత్సవాలు



వర్గల్, మార్చి 17: సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం గుట్టపై వెలసిన లక్ష్మీనృసింహస్వామి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు ఈనెల 19 నుంచి 30వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ ఈవో విశ్వనాథశర్మ తెలిపారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, 21న స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం, 25న పెద్ద గరుడోత్సవ సేవ, 29న విమాన రథోత్సవం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. వాహనాల పార్కింగ్, నిరంతర విద్యుత్ సరఫరా, పుష్కరిణి స్నానగుండంలో నీటిశుద్ధీకరణ ,తాగునీటి వసతి, నూటొక్క సత్రాల విడిది కేంద్రాలతో పాటు దాతల సహాయంతో నిర్మించిన ప్రత్యేక విడిది కేంద్రాల్లో భక్తులకు లోటుపాట్లు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతిరోజు స్వామివారికి వాహన సేవ నిర్వహిస్తామని తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎంపీ రఘునందన్, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, వంటేరు ప్రతాపరెడ్డి, తూంకుంట నర్సారెడ్డికి ఆహ్వాన పత్రికలు అందజేసినట్టు ఈవో తెలిపారు.

# పంటలు ఎండుతున్నా పట్టించుకోరా?

- ప్రభుత్వ నిర్లక్ష్యంతో పంటలు ఎడుతున్నాయి....
- కాలువకు మరమ్మతు చేసి వెంటనే నీళ్లివ్వాలి
- రైతుల కష్టాలు ఎమ్మెల్యే కవ్వంపల్లికి పట్టవా..?
- మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ విమర్శ



బెజ్జంకి మండలంలోని గుండారంలో ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న మాజీఎమ్మెల్యే రసమయి బాలకిషన్



నీళ్లిచ్చి పంటలను కాపాడాలని అధికారులను ఫోన్‌లో కోరుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి, మార్చి 17: మానకొండూర్ నియోజకవర్గంలో పంటలు ఎండుతుంటే స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ విమర్శించారు. బెజ్జంకి మండలంలోని గుండారం శివారులో రైతులు గైండ్ల నర్సయ్య, బొప్పెన కుంటయ్య, యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డికి చెందిన ఎండుతున్న పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం చౌడారం నుంచి వచ్చే ప్రధాన కాలువను పరిశీలించారు. కాలువకు మరమ్మతులు చేసి నీటిని విడుదల చేయాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా రసమయి మాట్లాడుతూ..నియోజకవర్గంలో పంటలు ఎండుతుంటే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రంగులు చల్లుకుంటూ పండుగ చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. గుండారం గ్రామ శివారులోని చౌడారం నుంచి వచ్చే కాలువకు మరమ్మతులు చేస్తే పంటలు ఎండిపోయే దుస్థితి వచ్చేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో వందల ఎకరాల్లో పంటలు ఎండుతున్నాయని, సాగునీళ్లు ఇవ్వాలని రైతులు, నాయకులు కోరుతే ఎమ్మెల్యే అనుచరులు ఎండిన పొలాలను చూసి హేళన చేసి మాట్లాడడం సిగ్గు చేటన్నారు. ఓవైపు పంటలు ఎండుతుంటే పెట్టుబడి అందక, రుణమాఫీ కాకా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతుల ఉసురు కాంగ్రెస్‌కు తప్పకుండా తలుగుతుందని విమర్శించారు. ఎమ్మెల్యేకు మానవత్వం లేదన్నారు. రైతును రాజు చేస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, రైతుల నోట్లో మట్టికొట్టేలా వ్యవహరిస్తున్నదని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క గుంట ఎండిన సందర్భం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో మంటుటెండల్లో నీళ్లిచ్చి పంటలను కాపాడినట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఎక్కడికక్కడ పంటలు ఎండుతున్నాయని, మేడిగడ్డ వద్ద గోదావరిలో పుష్కలంగా నీళ్లున్న బీఆర్ఎస్‌పై కోపంతో నీళ్లు పంపింగ్ చేయడం లేదని ఆరోపించారు. ఎండిన వరి పంటకు ప్రభుత్వం ఎకరాకు రూ.20 వేల నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశాడు. ఎమ్మెల్యేకు రైతులపై ప్రేమ ఉంటే వెంటనే పంటలకు సాగునీళ్లు ఇప్పించాలని, నిలిచిన పోయిన కాలువల పనులు పూర్తి చేయించి వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. లేకపోతే రైతులకు క్షమాపణ చెప్పాలని రసమయి బాలకిషన్ డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, నాయకులు లింగాల లక్ష్మణ్, ఎలుక దేవయ్య, బొమ్మకంటి రామలింగారెడ్డి, దీటి రాజు, లక్ష్మారెడ్డి, తిరుపతిరెడ్డి, అంజయ్య, భీమయ్య, గురువారెడ్డి, బాబు, అమరేందర్‌రెడ్డి, నరేశ్, రమేశ్, మల్లేశం, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్, సురేశ్, రాములు, ప్రవీణ్, యాదయ్య, భూంరెడ్డి పాల్గొన్నారు.

# నీళ్లిచ్చి పంటలను కాపాడాలి

- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విజ్ఞప్తి



మంత్రి ఉత్తమ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, మార్చి 17 : సాగునీరందక పంటలు ఎండిపోతున్నాయని, తలాపునా మల్లన్నసాగర్ ప్రాజెక్టు ఉన్నా దుబ్బాక నియోజకవర్గం రైతులు సాగునీటి కష్టాలు పడుతున్నారంటూ దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సోమవారం రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కలిసి విన్నవించారు. సోమవారం అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్‌ను ఆయన కలిసి తన నియోజకవర్గంలోని సాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి 'నమస్తే తెలంగాణ'తో ఫోన్‌లో మాట్లాడుతూ...మల్లన్నసాగర్ నుంచి 300 క్యూసెక్కుల నీరు కూడవెల్లి వాగులోకి విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. దీనికి మంత్రి స్పందించి, అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మల్లన్నసాగర్ నుంచి కూడవెల్లి వాగుకు నీరు విడుదల చేస్తున్నందున వాగు పరిసర గ్రామాల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. రామాయంపేట, చిన్నశంకరంపేట , దుబ్బాక మండలాల్లో నిలిచిపోయిన ఉప కాల్వల నిర్మాణ పనులు పూర్తిచేయాలని మంత్రి కోరినట్లు ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

# డంపుయార్డు పనులు ఆపాలి

- అసెంబ్లీలో ప్రస్తావించిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



అసెంబ్లీలో మాట్లాడుతున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, మార్చి 17 : సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డును తక్షణమే నిలిపివేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సోమవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు ఏర్పాటుతో మూడు మండలాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వెల్లడించారు. డంపింగ్ యార్డుకు సేకరించిన 152 ఎకరాల భూమి గ్యాప్ ల్యాండ్ అంటూ ప్రభుత్వం చెబుతున్నదని, అది గ్యాప్ ల్యాండ్ కాదని.. నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాలకు సంబంధించిన అటవీ భూమని పేర్కొన్నారు. ఈ భూమిని వెంటనే సర్వే చేయించాలని ప్రభుత్వాన్ని ఆమె కోరారు. డంపింగ్ యార్డు నిర్మాణంపై ఇప్పటికే కోర్టు స్టే ఇచ్చిందని సభాముఖంగా గుర్తుచేశారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ప్రశ్నకు మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమిస్తూ డంపింగ్ యార్డు అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. డంపింగ్ యార్డు అంశంపై అసెంబ్లీలో చర్చించినందుకు గుమ్మడిదల, నర్సాపూర్ మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

# సింగూరు నీరివ్వకుంటే గేట్లు ఎత్తుతాం

- మంత్రి దామోదరకు రైతుల బాధలు పట్టవా..?
- పంటలు ఎండిపోతుంటే చోద్యం చూస్తున్నారు..
- అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ విమర్శ
- పుల్కల్ మండలంలో ఎండిన పంటల పరిశీలన



హుమ్లా నాయక్ తండాలో ఎండిన పంటలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

పుల్కల్, మార్చి 17 : సింగూరు ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు సాగునీరివ్వకుంటే తామే గేట్లు ఎత్తాల్సి వస్తుందని ప్రభుత్వానికి అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ హెచ్చరించారు. పుల్కల్ మండలంలోని హుమ్లా నాయక్ తండా,లక్ష్మీసాగర్ శివారులో ఎండిన వరి, మొక్కజొన్న పంటలను సోమవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జైపాల్ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. పక్కనే సింగూరు ప్రాజెక్టులో 20 టీఎంసీల నీరున్నా సాగునీరు వదలక పోవడంతో పంటలన్నీ ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అప్రకటిత విద్యుత్ కోతలు, తరుచూ మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుండడం, నీళ్లులేక పంటలు ఎండిపోతుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదని సంగారెడ్డి జిల్లా అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదని విమర్శించారు. ఎండిన పంటలను చూస్తుంటే కండ్లలో నీళ్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సింగూరు నుంచి వానకాలం,యాసంగి రెండు పంటలకు నీళ్లు ఇవ్వలేదన్నారు. వ్యవసాయానికి నీరు ఇవ్వకుండా, సింగూరు నీటిని తాగునీటి అవసరాలకు వినియోగించుకోవడానికి ప్రభుత్వం చూస్తున్నట్లు విమర్శించారు. ప్రభుత్వం స్పందించి సింగూరు ఆయకట్టు రైతులకు నీరివ్వాలని డిమాండ్ చేశారు. ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహకు రైతుల బాధలు పట్టవా అని విమర్శించారు. మరో పదిహేను రోజుల్లో పంటలన్నీ ఎండిపోయే ప్రమాదం ఉందని, ఇప్పటికైనా మంత్రి చొరవ తీసుకుని తక్షణమే కాలువల ద్వారా నీటిని విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. లేకపోతే హరీశ్‌రావు, రైతులతో కలిసి సింగూరు ప్రాజెక్టును ముట్టడిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం కోడూరులో బీరప్ప కామరాతి కల్యాణోత్సవానికి హాజరయ్యారు. కార్యక్రమంలో ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల విజయ్‌కుమార్, మల్లేశం నాయకులు తదతరులు ఉన్నారు.

# ఎమర్జెన్సీని తలపిస్తున్న కాంగ్రెస్ పాలన

- బీఆర్ఎస్ గజ్వేల్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్, మార్చి 17: కాంగ్రెస్ పాలనలో ఎమర్జెన్సీని తలపించే పరిస్థితులు ఉన్నాయని, ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా అని బీఆర్ఎస్ గజ్వేల్ ఇన్‌చార్జి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. హామీలపై ప్రశ్నిస్తే ప్రతిపక్ష నాయకులను, జర్నలిస్టులను కేసులతో బెదిరించి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం కంటే ఎక్కువ సంక్షేమ పథకాలను ఇస్తారనే ఆశతో ప్రజలు రేవంత్‌రెడ్డి మాటలు విని ఓట్లేసి మోసపోయారని, 420 హామీలు అమలుకాకపోవడంతో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నట్లు తెలిపారు. సీఎం రేవంత్ నోటినుంచి దూషణలు తప్ప మంచి మాటలు రావడం లేదని విమర్శించారు. సాగునీటి కోసం రైతులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని పేర్కొన్నారు. డైవర్షన్ పాలిటిక్స్ చేయడం, హామీల గురించి ప్రశ్నిస్తే కేసులు పెట్టిస్తూ ప్రభుత్వం రాక్షసానందం పొందుతున్నదని విమర్శించారు. కాంగ్రెస్ అంటేనే అవినీతి, అక్రమాలు, స్కామ్‌లు అని ఆరోపించారు. రైతులు, విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, కాంట్రాక్టర్లు, రియల్టర్లు, నేతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కూడవెల్లి, హల్దీ వాగుల్లోకి నీటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని వంటేరు ప్రతాప్‌రెడ్డి కోరారు.

# నీళ్ల కోసం రోడ్డెక్కిన చేగుంట రైతులు

- గోదావరి నీళ్లు అందించాలని డిమాండ్



దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ వద్ద రోడ్డుపై ఆందోళన చేస్తున్న రైతులను సముదాయిస్తున్న తొగుట సీఐ లతీఫ్

రాయపోల్, మార్చి 17 : తలాపున గోదావరి నీళ్లు పారుతున్నప్పటికీ తమ పంట పొలాలకు నీరందక ఎండిపోతున్నాయని మెదక్ జిల్లా చేగుంట మండలంలోని పలు గ్రామాల రైతులు సోమవారం సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ చౌరస్తాలోని రామాయంపేట కెనాల్ వద్ద రోడ్డుపై టెంట్లు వేసుకుని పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. దీంతో గజ్వేల్-చేగుంట ప్రధాన రహదారి కిలోమీటర్ల మేర వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మెదక్ జిల్లా చేగుంట మండలంలోని పోతన్‌పల్లి, చందాయిపేట, కసాన్‌పల్లి, పోతంశెట్‌పల్లి, మక్కరాజ్‌పేట, దౌల్తాబాద్ మండలంలోని మాచిన్‌పల్లితో పాటు తదితర గ్రామాలకు చెందిన సుమారు 500 మంది రైతులు రోడ్డుపై బైఠాయించారు. టెంట్లు వేసుకుని సాయంత్రం వరకు నిరసన తెలిపారు. పార్టీలకతీతంగా రైతులు,నాయకులు అందరూ ఒక్కటై రోడ్డు దిగ్బంధం చేశారు. తమ గ్రామాల పక్క నుంచే వెళ్తున్న గోదావని నీరు తమకు రాకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుప్రియాల్ వద్ద రామాయంపేట కెనాల్ నుంచి కొద్ది దూరంలోని తమ గ్రామాల గొలుసుకట్టు చెరువులు నింపి నీరు అందిస్తే యాసంగి పంటలు దక్కుతాయని రైతులు తెలిపారు. రైతులు ఆందోళన విషయంగా తెలియగానే తొగుట సీఐ లతీఫ్ వచ్చి వారిని సముదాహించే ప్రయత్నం చేశారు. రైతులు వినిపించుకోకుండా వారి ఆందోళన మరింత ఉధృతం చేశారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ దుబ్బాక నిజయోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి హుటాహుటిన అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. సాగునీరు అందించేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఇందుప్రియాల్ వద్ద రామాయంపేట కెనాల్ ద్వానా వస్తున్న గోదావరి జలాలను ఆయన పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. చేగుంట రైతులకు సాగునీరు అందించాలని కోరారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

# ఐఐటీహెచ్, జర్మనీ కలిసి పరిశోధనలు

కుదిరిన అకడమిక్ ఎక్ఛేంజ్ ప్రోగ్రామ్



ఐఐటీహెచ్‌ను సందర్శించిన జర్మనీ విశ్వవిద్యాలయాల ప్రతినిధుల బృందం

సంగారెడ్డి, మార్చి17(నమస్తే తెలంగాణ) : సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌ను సోమవారం జర్మనీలోని పలు విశ్వవిద్యాలయాల అధిపతులు, అకడమిక్ ఎక్ఛేంజ్ సర్వీస్‌కు చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం సందర్శించింది. జర్మనీ బృందం ప్రతినిధి జనరల్ సెక్రటరీ డాక్టర్ కైసిక్స్, జర్మన్ కాన్సులేట్ జనరల్ కాథరిన్ మసెరా లాంగ్, ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, జర్మనీ-ఐఐటీహెచ్ అకడమిక్ ఎక్ఛేంజ్ ప్రోగ్రామ్‌పై చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ కైసిక్స్ మాట్లాడుతూ.. జర్మనీలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, విద్యార్థులు అకడమిక్ ఎక్ఛేంజ్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఐఐటీహెచ్‌కు రానున్నట్లు తెలిపారు. జర్మనీ,ఐఐటీహెచ్ విద్యార్థులు కలిపి ఫార్మా, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ రంగాల్లో పరిశోధనలు జరపనున్నట్లు చెప్పారు. జర్మన్ కాన్సులేట్ జనరల్ కాథరిన్ మసెరా లాంగ్ మాట్లాడుతూ.. జర్మనీ, భారత్ అనేక రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంపొందించుకుంటున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో జర్మనీలోని విశ్వవిద్యాలయాలు, భారత్‌లోని విశ్వవిద్యాలయాలు కలిసి పనిచేయనున్నట్లు చెప్పారు. ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ.. ఐఐటీహెచ్‌ను జర్మన్ బృందం సందర్శించి అకడమిక్ ఎక్ఛేంజ్ ప్రోగ్రామ్‌పై చర్చలు జరపడం సంతోషంగా ఉందన్నారు. విద్యా నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు నూతన ఆవిష్కరణలపై కలిసి పనిచేస్తామని చెప్పారు. ఇండో-జర్మన్ సంబంధాల బలోపేతానికి ఐఐటీహెచ్ తనవంతు పాత్ర పోషిస్తుందని తెలిపారు. అధ్యాపక, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాల ద్వారా రెండు దేశాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. త్వరలోనే ఐఐటీహెచ్‌లో ఇండో-జర్మన్ ఎక్సలెన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తద్వారా ఆవిష్కరణలు, పరిశోధనల్లో ఇరుదేశాలకు మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్‌లోని జర్మనీ గౌరవ కాన్సుల్ అమితా దేశాయ్, జర్మనీ ప్రతినిధులు ప్రొఫెసర్ గెసిన్ గా రండే, డ్యూయిస్ బర్గ్, క్రిస్టియన్ జోసఫ్, మార్టిన్, ఆడ్రియాస్ మార్క్, అలివర్ ఫ్రోర్, ఐఐటీహెచ్ ప్రొఫెసర్లు తరుణ్ కాంతి పాండా, ప్రేమ్‌పాల్, మయూర్ తదితరులు పాల్గొన్నారు.


## లద్నూర్ రిజర్వాయర్ నింపాలి

బొమ్మకూరు పంపుహౌస్ వద్ద రైతుల ధర్నా

మద్దూరు(ధూళిమిట్ట),మార్చి17: సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని లద్నూర్ రిజర్వాయర్‌లోకి వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జనగామ జిల్లా నర్మెట మండలంలోని బొమ్మకూరు పంపుహౌస్ వద్ద లద్నూర్ గ్రామ మాజీ సర్పంచ్ జీడికంటి సుదర్శన్, మాజీ ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్యల ఆధ్వర్యంలో సోమవారం రైతులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ .. లద్నూర్ రిజర్వాయర్‌ను నమ్ముకొని పంటలు సాగు చేసిన రైతులలకు రిజర్వాయర్‌లో నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. పంటలు ఎండిపోవడంతో రైతులు పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు తీరే మార్గం లేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలన అంటేనే ప్రజాకంటక పాలన అని ధ్వజమెత్తారు. ప్రభుత్వం వెంటనే దిగివచ్చి లద్నూర్ రిజర్వాయర్‌లోకి నీటి విడుదల చేయాలన్నారు. నీటిని విడుదల చేయకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సంగమేశ్వర పనులు వేగంగా చేపట్టాలి

- అసెంబ్లీలో ప్రభుత్వానికి జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు విజ్ఞప్తి
- జహీరాబాద్ ప్రాంత రైతులకు త్వరగా నీరివ్వాలని ప్రభుత్వానికి విన్నపం




అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, మార్చి 17 : సంగమేశ్వర్ ఎత్తిపోతల పథకం పనులు వేగంగా పూర్తిచేసి జహీరాబాద్ ప్రాంత రైతులకు సాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సోమవారం అసెంబ్లీలో ఆయన ఈ ప్రాజెక్టు గురించి మాట్లాడారు. జహీరాబాద్ ప్రాంతంలో నదులు, పెద్ద చెరువులు లేవన్నారు. కేవలం వర్షాధారంపైనే నమ్ముకుని నియోజకవర్గంలోని రైతులు వ్యవసాయం చేస్తున్నారని చెప్పారు. పంటలకు సాగునీరు అందించేందుకు నియోజకవర్గంలో రైతులు పొలాల్లో వేయి ఫీట్ల వరకు బోర్లు డ్రిల్లింగ్ చేసినా నీరు రాక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్ సంగమేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూపకల్పన చేసినట్లు గుర్తుచేశారు. దీనిద్వారా 622 మీటర్ల ఎత్తులో ఉన్న జహీరాబాద్ నియోజకవర్గంలోని రైతులకు కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి సాగునీరు అందించేందుకు పథకానికి భూమిపూజ చేసినట్లు తెలిపారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని జహీరాబాద్, న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్, మొగుడంపల్లి మండలాల పరిధిలోని 115 గ్రామాల్లో 1,03,259 ఎకరాలకు సాగు నీరందించేందుకు ఈ పథకం పనులు మొదలు పెట్టినట్లు తెలిపారు. మునిపల్లి మండలంలోని చిన్నచల్మెడలో పంపుహౌస్ కోసం అప్పటి ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు భూమిపూజ చేశారన్నారు. జహీరాబాద్ ప్రాంత రైతులు వాణిజ్య పంటలు ఎక్కువగా సాగుచేస్తారని , ఈ పంటలకు నీరు ఎక్కువగా అవసరం ఉంటుందన్నారు. ఈ ఎత్తిపోతల పథకం త్వరగా పూర్తిచేసి సాగురందిస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని కోరారు.

# రేకుల షెడ్డుకు రెండువేల ఇంటిపన్ను

హుస్నాబాద్‌లో పండుటాకుకు ఎంత కష్టం



ఈ రేకుల షెడ్డుకు రెండువేల రూపాయలకుపైగా ఇంటిపన్ను విధించిన మున్సిపల్ అధికారులు

హుస్నాబాద్ టౌన్, మార్చి 17: నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్నట్టు ఉంది హుస్నాబాద్ మున్సిపల్ అధికారుల తీరు. హుస్నాబాద్ పట్టణంలోని ఇరవై వార్డుకు చెందిన కవ్వ ఇందిర అనే వృద్ధురాలు రేకుల షెడ్డులో నివసిస్తున్నది. ఈ రేకుల షెడ్డుకు మున్సిపల్ అధికారులు ఏడాదికి రెండువేల రూపాయలకు పైగా ఇంటిపన్నును విధించారు. వాస్తవంగా పట్టణంలోని స్లాబ్ ఉన్న ఇండ్లకు కూడా ఇంతస్థాయిలో ఇంటి పన్ను లేదు. కానీ, ఇక్కడ అధికారులకు వృద్ధురాలు ఇందిర రేకుల షెడ్డును పలు అంతస్తుల భవనం మాదిరిగా కనిపించిందో ఏమో, ఏకంగా రెండువేల రూపాయల ఆస్తి పన్నును విధించారు. పైగా రెండేండ్లకు ఐదువేల రూపాయల ఆస్తి పన్ను చెల్లించాలంటూ వార్డు అధికారులు ఆమెకు నోటీస్ ఇచ్చారు. దీంతో ఆ వృద్ధురాలు వాపోతున్నది. తమకేమి తెలియదంటూ వార్డు అధికారులు చెబుతున్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రత్యేకంగా రేకుల షెడ్డును పరిశీలించి ఆస్తిపన్నును సవరించాలని ఆమె వేడుకుంటున్నది.